

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.అఖిల(19) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. - 8లో



పొదుపు డబ్బు కోసం వెళ్లొస్తుండగా..

పొద్దుపు డబ్బు కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొనడంతో గురుస్వామి (45), జల్ల అంజి (35) మృతి చెందారు. - 8లో

గరిష్టం/కనిష్టం
36.4 /17.2

వాతావరణం

జిల్లాలో సోమవారం 17.2 – 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 31 శాతం మధ్య నమోదైంది

- విచిత్ర వేషధారణతో పల్లెపల్లెనా శివపార్వతుల కథాగానం
- శివరాత్రి సందర్భంగా ఊరూరా పర్యటన
- పండుగనాడు మల్లయ్యకొండకు చేరి విశేష పూజలు
- ఆదరణ కరువై.. ఆదాయం మృగ్యమైన అండె కురబలు
- వేల నుంచి వేళ్ల మీద లెక్కపెట్టగలిగే సంఖ్యకు చేరిక
- అంతరించిపోతున్న అరుదైన జానపద కళారూపం



మరుపు దారిలో మల్లయ్యదారులు

సాధువులేలే మల్లయ్యకొండ..
భక్తులేలే మల్లయ్యకొండ..
ఎలకతీర్థం వెలసిన కొండ..
ఏనుగు మల్లమ్మ ఏలిన కొండ..

.. అంటూ మల్లయ్యదారుల గొంతు నుంచి పల్లెపల్లెనా ప్రతిధ్వనించిన పాట ఇప్పుడు పెదవులు దాటని పద్యంలా వినిపిస్తోంది.

శరీరంపై నల్లటి దుస్తులు
శిరంపై ఎలుగుబంటి కుచ్చులు
మెడలో బండారు తిత్తి, గవ్వలపట్టెడ
ఒకచేత ఢమరుకం, మరోచేత పిల్లనగ్రోవి..

.. ఇలా విచిత్ర వేషధారణతో శివదండకం పఠిస్తూ సంచరించిన సమూహ సన్నివేశం ఇప్పుడు ఎరుక లేని ఏకపాత్రాభినయంలా కనిపిస్తోంది.

SAKSHI SPECIAL

(షేక్ ముజుబుద్దీన్, సాక్షి, కడప డెస్క్)

పరమశివుడి పండుగ వచ్చిందంటే మల్లయ్యదార్లకు పరమానందం. త్రిశూలాలు చేతబట్టి శివదండకం పఠిస్తూ పల్లెల్లో ప్రత్యక్షమవుతారు. శివపార్వతుల కథ చెబుతూ పర్యటిస్తారు. మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రాశస్త్యాన్ని పాటలు, పద్యాల రూపంలో వినిపిస్తారు. తమ సంగీత, నాట్య విన్యాసాలతో ప్రజలను రంజింపచేస్తారు.

ప్రాంతాన్ని బట్టి పేరు

అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని బురుజుకురవపల్లె, చిన్నకురవపల్లె, చిన్నమండెం మండలంలోని కేశాపురం, వండాడి, సత్యసాయి జిల్లాలోని తనకల్లు మండలంలోని చిన్న ఎద్దులవారిపల్లెతో పాటు రాయలసీమలో కొన్ని గ్రామాల్లో మాత్రమే వీరు నివాసముంటున్నారు. కురబ సామాజిక వర్గానికి చెందిన అండె కురబలే ఈ మల్లయ్యదార్లు. వీరిని ఒగ్గప్ప స్వాములని, గొడుగు మల్లయ్యలని, మల్లయ్య కుక్కలని, దేవరధారులని ప్రాంతాన్ని బట్టి పిలుచుకుంటారు.

ఆదిభిక్షువుకు ప్రతిరూపాలు

మల్లయ్యలు శివుడికి ప్రతిరూపాలు. శివరాత్రికి రెణ్నెల్ల ముందు వీరు మల్లయ్యదీక్ష చేపడతారు. అన్ని వ్రతాల కంటే ఈ దీక్ష పవిత్రమైంది. భిక్ష స్వీకరించడం ఈశ్వరుడి వరమని, పూర్వజన్మ సుకృతమని వీరి నమ్మకం. దీక్ష చేపట్టాక మల్లయ్యలు భిక్షానికి వెళతారు. తమ స్వగ్రామాల నుంచి విడిపోయి బృందాలుగా నడుచుకుంటూ బయలుదేరుతారు. 'వర్తన'ల పేరుతో ఒక్కో ప్రాంతంలోని కొన్ని గ్రామాలను సందర్శించి భిక్ష స్వీకరించటం వీరి హక్కుగా (మాన్యం) ఉంటుంది. ఓ బృందం హక్కుగా ఉండే ప్రాంతంలో మరో బృందం భిక్ష స్వీకరించటం నేరం. 20 నుండి 25 మంది బృందాలుగా వచ్చే మల్లయ్యలు ప్రజలకు పండుగ వస్తోందని గుర్తుచేస్తారు. శివభిక్ష స్వీకరిస్తారు. గతంలో వీరికి దేవకానుక, రాజకానుక, గుడికానుక, గురుకానుక, ఇంటి కానుకలనే ఐదు రకాల కానుకలు గౌరవంగా అందేవి. అదనంగా బహుమానాలుండేవి. తర్వాత కాలంలో రైతులు దేవరపంటగా తీసే వరిధాన్యంతో పాటు బెల్లం, కందిబేడలు, ఆవునెయ్యి అందించసాగారు. పంటలు పండి ఇండ్లకు ధాన్యం వచ్చేకాలం కాబట్టి రైతులు ఆత్మీయంగా తోచినవన్నీ ఇస్తారు. అవే వారికి జీవనాధారం.

'కొండ'ంత సంబరం

మల్లయ్యదారులు 60 రోజుల భిక్ష తరువాత శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు మల్లయ్య కొండపైకి చేరతారు. తమ వంశాచారం ప్రకారం మహా శివరాత్రికి చేసే నాట్యాలు భక్తులను మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. ఢమరుకనాదంతో కొండ మారుమోగుతుంది. పాలు, బెల్లం గిన్నెలో పెడితే వాటి చుట్టూ గిర్రున తిరుగుతూ వీరు పాలు తాగే విన్యాసాలు చూడ చక్కగా ఉంటాయి.

అన్నదాన ప్రారంభకులు..

మల్లయ్యదార్లు శివరాత్రి ఉత్సవాలకు అన్నదాన ప్రారంభకులు. వీరు తాము దీక్ష చేసి భిక్షగా స్వీకరించిన ఆహారధాన్యాలను వండి తొలుత శివుడికి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. తరువాత ప్రసాదంగా భక్తులకు పంచిపెట్టేవారు. క్రమేణా మిగిలిన ధాన్యాన్ని సైతం వండి భక్తులకు అన్నదానం చేసేవారు.



పాతికభాగం నుంచి పదో పరకో స్థాయికి

మల్లయ్యదారులకు గతంలో ఆలయానికి మహాశివరాత్రి సందర్భంగా వచ్చే ఆదాయంలో పాతిక భాగం ఇచ్చి పంపేవారు. ఇప్పుడు వచ్చినవారికి ఎంతోకొంత మాత్రమే ఇస్తున్నారు. మల్లయ్యకు 1990లో అప్పటి ఆలయ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి గుర్తింపు సర్టిఫికెట్లతో పాటు కాపర్ బ్యాడ్జీలు ఇచ్చారు. వీటిని వారు ఇప్పటికీ అపురూపంగా దాచుకున్నారు.



వేరే వృత్తి అలవడక..

వ్రతంలో భాగంగా భిక్షాటనకు అలవాటు పడినందున వీరికి ఇతర వృత్తులు అలవడలేదు. చాలా తక్కువ మందికి మాత్రమే భూమి, జీవాలున్నాయి. స్థిరమైన ఆదాయం లేకపోవడంతో మల్లయ్యదారులు నిరుపేదలుగానే బతికారు. చివరికి సమాజంతో పాటు వారి సామాజికవర్గంలో సైతం చిన్నచూపు చూడబడ్డారు. ఈ క్రమంలో వీరి కుటుంబాలతో ఇచ్చిపుచ్చుకోవడాలు కూడా మానుకున్నారు. ఫలితంగా మల్లయ్యదారుల కొత్తగా దీక్షలు చేపట్టడం మానుకున్నారు. కొందరు మాత్రం వారసత్వంగా వచ్చిన సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

అవసానదశకు చేరి..

ఒకనాడు వేల సంఖ్యలో ఉన్న మల్లయ్యలు ఇప్పుడు వేళ్ల మీద లెక్కగట్టేంత మంది మాత్రమే ఉన్నారు. దీంతో మల్లయ్యదార్ల అరుదైన కళారూపం అవసానదశకు చేరింది. అంతరించిపోతున్న ఈ జానపదకళకు జీవం పోయాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



- **నలుగురు మిగిలారు**

శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కురమోళ్లపల్లికి చెందిన చిన్న మల్లయ్య, వెంకటమల్లయ్య, మల్లేష్, శివశంకర్ ప్రతి ఏటా మల్లయ్యకొండలో జరిగే శివరాత్రి వేడుకలకు ప్రత్యేక వేషధారణలో వెళ్లి స్వామి వారి వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ యేడాది కూడా శివరాత్రి వేడుకల్లో పాల్గొనడానికి సిద్ధమయ్యారు. గతంలో పదుల సంఖ్యలో శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడానికి మల్లయ్యకొండకు వెళ్లేవారమని, ప్రస్తుతం గ్రామం నుంచి నలుగురు మాత్రమే వెళ్లుతున్నట్లు వీరు తెలిపారు.

మాతోనే అంతరించిపోయేలా ఉంది



స్వామివారి సేవలో 35 ఏళ్ల పాటు ఉన్నాను. ఈ కళకు ఆదరణ కరువవడంతో మా పిల్లలు ఈ సంప్రదాయం పట్ల మొగ్గు చూపడం లేదు. ఈ కళ మాతోనే అంతరించిపోయేలా ఉంది.

– శారదయ్య, బురుజుకురవపల్లె, పెద్దమండ్యం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



తరతరాలుగా వస్తున్న ఆచారాలకు కట్టుబడి స్వామి వారి కీర్తనలు వల్లె వేస్తాం. మమల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– వెంకట మల్లయ్య(60), వండాడి గ్రామం, చిన్నమండెం మండలం.

గుర్తింపు ఇవ్వాలి



మల్లయ్యకొండ దేవస్థానం వారు మమ్మల్ని గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలి. – జి.మల్లయ్య, మల్లయ్యదారుడు, ఎద్దులవారిపల్లె, తనకల్లు మండలం

గౌరవ వేతనానికి కృషి



మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి చరిత్రను గ్రామాలలో చాటింపు చేసి ఉత్సవాలకు ప్రజలను స్వాగతించేందుకు మల్లయ్యదారులు తమదైన కళను ప్రదర్శించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం వారి సంఖ్య తగ్గిపోయింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లి దేవదాయశాఖ అధికారులతో చర్చించి వారికి దేవస్థానం తరపున గౌరవ వేతనం ఇచ్చేందుకు కృషి చేస్తాం.

– కేఆర్ మల్లిరెడ్డి, మల్లయ్యకొండ ఆలయ కమిటీ చైర్మన్, తంబళ్లపల్లె

న్యూస్‌రీల్

పోస్టర్ల ఆవిష్కరణ

కడప సిటీ : ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలకు (ఫిబ్రవరి 13–17) సంబంధించిన పోస్టర్లను ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజలకు ఆర్థిక సేవలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

21న బోటనీ అకడమిక్ కన్సల్టెంట్ నియామకానికి ఇంటర్వ్యూలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రశాఖలో అకడమిక్ కన్సల్టెంట్ నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి తెలిపారు. ఎంఎస్సీ బోటనీతో పాటు పీహెచ్‌డీ, నెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతో విశ్వవిద్యాలయంలోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో 21వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. గతంలో విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్ర విభాగంలో అధ్యాపకులుగా పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

– ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

కడప సిటీ : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతగా, పారదర్శకంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల అధికారులైన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ టీం సిబ్బంది, మోడల్ కోడ్ అమలు నిర్వహణపై బద్వేలు ఆర్డీఓ వెంకటరమణ, ఎస్‌ఎస్‌పీ పీఓ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికలను ప్రశాంతంగా జరిపినట్లే ఈ ఎన్నికలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈసీ ఆదేశాల మేరకు నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. ఫ్లయింగ్ టీమ్‌లో ఒక నోడల్ అధికారి, ఇద్దరు పోలీసులను నియమిస్తామన్నారు. పోటీ చేసే అభ్యర్థుల ప్రచారంలో మూడు వాహనాలకు మించి ఎక్కడా కాన్వాయ్ నిర్వహించరాదన్నారు. పీఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులకు వేర్వేరు బాధ్యతలకు సంబంధించి వేర్వేరు వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేసి రోజువారి విధుల సమాచారాన్ని అందులో షేర్ చేయాలన్నారు.ఈఓపీఆర్‌డీలు, ఈఈలు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రేపు సీఎం వైఎస్ జగన్ జిల్లాకు రాక

- జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గాల్లో పర్యటన
- నున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ
- పులివెందులలో వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరు



కడప సిటీ : రాష్ట్ర ముఖ్యంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15వ తేదీ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంటుకు భూమి పూజ నిర్వహించనున్నారు. అక్కడి మౌలిక సదుపాయాలపై సమావేశం కానున్నారు. అనంతరం అక్కడి నుంచి పులివెందులకు చేరుకుని ఎస్‌సీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో జరిగే మూలి బలరామిరెడ్డి కుమారుని రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం అక్కడి నుంచి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని తాడేపల్లికి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం నుంచి షెడ్యూల్ సమాచారం అందింది.

సీఎం షెడ్యూల్ ఇలా! 15.02.2023 (బుధవారం)

- ఉదయం 9.00 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 9.30 గంటలకు ప్రత్యేక విమానంలో అక్కడి నుంచి బయలుదేరి 10.15 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.15 నుంచి 10.25 గంటల వరకు స్థానిక నేతలతో మాట్లాడతారు.
- 10.30 గంటలకు కడప ఎయిర్ పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.50 గంటలకు జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.10 గంటలకు జేఎస్‌డబ్ల్యు స్టీల్‌ప్లాంటుకు సంబంధించి భూమి పూజ శిలా ఫలకాల వద్దకు చేరుకుని 11.15 నుంచి 11.30 గంటల వరకు శిలా ఫలకాలు ఆవిష్కరించే కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11.45 నుంచి 12.45 గంటల వరకు జేఎస్‌డబ్ల్యు స్టీల్‌ప్లాంటు మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 1.20 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.40 గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- హెలిప్యాడ్ నుంచి 1.45 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి పులివెందులలో ఉన్న ఎస్‌సీఎస్‌ఆర్ ఫంక్షన్ హాలుకు 1.55 గంటలకు చేరుకుంటారు.
- 2.00 నుంచి 2.15 గంటల వరకు అక్కడ మూలి బలరామిరెడ్డి కుమారుని వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు.
- 2.30 గంటలకు భాకరాపేట హెలిప్యాడ్‌కు చేరుకుని 2.40 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- కడప ఎయిర్‌పోర్టు నుంచి 3.20 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 4.10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 4.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

ఎంపీ, ఎమ్మెల్యే ఏర్పాట్ల పరిశీలన



స్టీల్‌ప్లాంట్ భూమి పూజ పనులను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

జమ్మలమడుగు : కన్యతీర్థం సమీపంలో ఏర్పాటు చేస్తున్న స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలు సోమవారం పరిశీలించారు. ఇప్పటికే హెలిప్యాడ్ ఉండగా జిందాల్ కంపెనీ యాజమాన్యం సైతం వస్తుండటంతో మరో హెలిప్యాడ్ నిర్మాణం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో పరిమిత సంఖ్యలో ముఖ్య ప్రతినిధులు మాత్రమే హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు, మున్సిపల్‌చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, హృషికేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలి

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : జిల్లాలో మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను సమూలంగా నిషేధించి జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలో మత్తు మందుల నివారణ, అక్రమ రవాణా నిరోధంపై కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన జాయింట్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ సాయికాంత్‌వర్మ, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనాలతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

- నియోజకవర్గాల వారీగా స్వచ్ఛంద సంస్థలను గుర్తించి వారి ద్వారా మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి.
- జిల్లాలో ఉన్న ప్రతి మెడికల్ షాపులో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నిషేధిత మందుల అమ్మకాలను అరికట్టడంతోపాటు 18 సంవత్సరాలలోపు బాలలకు వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులు ఇవ్వబడవు అన్న సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి మత్తు పదార్థాలు అమ్మకుండా చర్యలు చేపట్టాలి.
- రిమ్స్ ప్రాంగణంలోని సఖి సెంటర్‌లో డి అడిక్షన్ సెంటర్‌ను అన్నివేళలా అందుబాటులో ఉంచడంతోపాటు అక్కడికి వచ్చే బాలల విషయంలో జాగ్రత్తలు వహించాలి.
- కళాశాలలు, పాఠశాలలు, డాబాలలో, ఇంజినీరింగ్ కళాశాలల్లో మత్తు పదార్థాలు నివారించే చర్యలపై పోస్టర్లను ఏర్పాటు చేయాలి.
- ఎన్‌సీసీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ నాగరాజు, సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, సీపీఓ వెంకటరావు,రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మెంబర్ ఎం.లక్ష్మీదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్, పోలీసు, సఖి సెంటర్ అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'లో అర్జీల స్వీకరణ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమం ద్వారా సోమవారం అధికారులు అర్జీలను స్వీకరించారు. కలెక్టరేట్‌లోని సభా భవనంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనంద్‌నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

- అమృత్‌భారత్ స్టేషన్ల పథకంతో.. రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మూడు స్టేషన్లకు మంచి రోజులు
- 53 రకాల సదుపాయాలతో అభివృద్ధికి చర్యలు
- మాస్టర్‌ప్లాన్ కోసం నిపుణుల కమిటీ నియామకం

రైల్వేస్టేషన్లకు మహర్దశ



కడప రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం

రాజంపేట/కడప కోటిరెడ్డి సర్కిల్ : కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఇటీవల ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో అమృత్ భారత్ స్టేషన్ల పథకం తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో మూడు రైల్వేస్టేషన్లకు మహర్దశ కలగనుంది. వైఎస్సార్ జిల్లాలో కడప, అన్నమయ్య జిల్లాలో రాజంపేట, పీలేరు స్టేషన్లు ఉన్నాయి. ఈ పథకం కింద 53 రకాల సదుపాయాలతో అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నారు.

ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపకల్పన

అమృత్ భారత్ స్టేషన్ల పథకం అమలులో భాగంగా ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేయనున్నారు. ఇందులో భాగంగా నిపుణుల కమిటీని నియమించనున్నారు. ఈ నిపుణుల కమిటీ స్టేషన్లను పరిశీలించనుంది. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు మాస్టర్‌ప్లాన్ తీసుకురానున్నారు. అనంతరం బడ్జెట్‌ను రూపొందించి దశలవారీగా స్టేషన్ల అభివృద్ధి పనులు చేపడతారు.

ప్రధాన సౌకర్యాలు ఇవే..

- కడప, రాజంపేట, పీలేరు రైల్వేస్టేషన్లలో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునిక శైలిలో నిర్మించనున్నారు. ప్లాట్‌ఫాం పొడవును కూడా పెంచనున్నారు. 600 మీటర్లు ఉన్న ప్లాట్‌ఫాంలు 760 మీటర్ల నుంచి 840 మీటర్ల వరకు పొడిగించే అవకాశాలున్నాయి. స్టేషన్లలో రైలుపట్టాల పరిశుభ్రత కోసం బ్యాలస్టలెస్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు, ప్రత్యేక ప్రవేశమార్గాలు, ఇతర సదుపాయాలు ఉంటాయి.
- వెయింటింగ్‌హాల్స్, వాటికి అనుబంధంగా కేఫెటేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి కనీసం రెండుస్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.
- ప్రతి స్టేషన్ మొదటి అంతస్తులో ప్రత్యేకంగా రూఫ్ ప్లాజా, సమావేశ మందిరాలు నిర్మించనున్నారు.
- స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్‌రోడ్లు, పార్కింగ్ ఏరియా, పాదచారులకు ప్రత్యేకదారి
- ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫై సేవలకు 5 జీ టవర్లు ఏర్పాటుచేసే దిశగా మాస్టర్‌ప్లాన్ కొనసాగనుంది.

కడప రైల్వేస్టేషన్‌కు కొత్తరూపు

కడప రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. కడప రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ విస్తరణ, ఎత్తు పెంచడం, రెండవ వైపు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు, రెండవ ప్లాట్‌ఫామ్‌పై షెడ్ల నిర్మాణం తదితర వాటిని చేపట్టనున్నారు. ఈ రైల్వేస్టేషన్‌లో రోజురోజుకు ప్రయాణికుల రద్దీ పెరుగుతోంది. అయితే సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ క్రమంలో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో కడప రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేయడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా సమాచారం

స్టేషన్	ఎన్ఎస్‌జీ క్యాటగిరి	జిల్లా
కడప	3	వైఎస్సార్
రాజంపేట	5	అన్నమయ్య
పీలేరు	6	అన్నమయ్య

స్టేషన్ల చరిత్ర...

కడప : దేవుని కడప, పెద్దదర్గా, జిల్లా కేంద్రం
రాజంపేట : తొలితెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక , పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం
పీలేరు : పీలేరు నుంచి వాల్మీకిపురం (కోదండరామాలయం), గుర్రంకొండ, తలకోన ప్రాంతాలకు పర్యాటకులు వస్తుంటారు.

పీలేరు స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



పీలేరు స్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ స్టేషన్ ద్వారా వివిధ పర్యాటక ప్రాంతాలకు చేరుకునే వారికి సదుపాయాలు కల్పించాలి. అన్ని సౌకర్యాలు ఉంటే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది.

– కావలి చిన్న, టీసీనేత, వైఎస్సార్‌సీపీ, పీలేరు

రైల్వేస్టేషన్ అభివృద్ధిపై దృష్టి సారించాలి



రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధిపై రైల్వేశాఖ దృష్టి సారించాలి. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల పరంగా మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలి.

– ఎం.ఎస్.రాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ, రాజంపేట

ఎయిర్‌పోర్టులా తీర్చిదిద్దాలి

కడప రైల్వేస్టేషన్ ఆధునికీకరణతో అన్ని సౌకర్యాలు వస్తాయి. రిటైరింగ్ రూములు ప్రయాణికులకు అందుబాటులో ఉండాలి. కడప రైల్వే స్టేషన్‌ను ఎయిర్‌పోర్టులా తీర్చిదిద్దాలి.



– వెంకటేశ్వర ఆచారి, బంగారు వ్యాపారి, టీకేఎం స్ట్రీట్, కడప,

క్లుప్తంగా

900 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 900కిలోల రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు ముద్దనూరు మండలం కొలవలి గ్రామానికి చెందిన పాయసం రాముడు చిలంకూరులో బియ్యాన్ని ఆటోలో తీసుకుని పోతుండుగా పట్టుకున్నట్లు చెప్పారు.ఆటోను స్వాధీనం చేసకుని, రాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



దుంగలు, నిందితుడితో టాస్క్‌ఫోర్స్ అధికారులు

రైల్వేకోడూరు : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం గాదెల సెక్షన్‌లో సోమవారం ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సబ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ కె.కృపానంద తెలిపారు.

ఆయన కథనం మేరకు ముందస్తు సమాచారం మేరకు ఓబులవారిపల్లె మండలం గాదెల సెక్షన్ బీట్ పరిధిలోని దాసలకోన అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించాం. అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు గుర్తించాం. సంఘటనా స్థలానికి వెళ్లి తమిళనాడు సేలంకు చెందిన పెరుమాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 8 ఎర్రచందనం దుంగలను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య



ఎం.అఖిల మృతదేహం

వేంపల్లె : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.అఖిల(19) ఆత్మహత్య చేసుకుంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలో నివాసముంటున్న మంగేర యోగాంజనేయులు, విజయకుమారి దంపతులకు కుమార్తె అఖిల, కుమారుడు అనిల్ ఉన్నారు. కుమార్తె అఖిల ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతోంది. నాన్న యోగాంజనేయులు జీవనోపాధి కోసం కువైట్‌లో ఉన్నాడు. తల్లి విజయకుమారి పిల్లలను చదివించుకుంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రోజు మాదిరే కుమార్తె అఖిల ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని హాస్టల్ గది నుంచి తోటి విద్యార్థినులతో క్లాసులకు వెళ్లింది. ఒక పిరియడ్ అయిపోయాక నేరుగా ఒంటరిగా హాస్టల్ గదికి వచ్చి 10.30 గంటల ప్రాంతంలో కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం తరగతి గది నుంచి తోటి విద్యార్థినులు హాస్టల్ గదికి రాగా అఖిల ఉరి వేసుకోవడం చూసి వెంటనే ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన డైరెక్టర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఆర్‌కే వ్యాలీ ఎస్ఐ రంగారావు, వేంపల్లె ఎస్ఐ తిరుపాల్ నాయక్‌లు డైరెక్టర్ సంధ్యారాణితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అప్పటికే విద్యార్థిని అఖిల మృతి చెందడంతో ట్రిపుల్ ఐటీ అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి విజయకుమారి ఫిర్యాదు మేరకు చదువు ఒత్తిడివల్లే కుమార్తె ఆత్మహత్య చేసుకుని ఉంటుందని చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి, తోటి విద్యార్థులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు విద్యార్థి అఖిల వారి బంధువుల అబ్బాయిని ప్రేమించిందని.. పెద్దలు ఒప్పుకోకపోవడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు.

విషాద ఘటనలు

ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలలో వరుస ఆత్మహత్య ఘటనలతో విషాద ఛాయలు అలుముకుంటున్నాయి. చదువు ఒత్తిడి కారణంగా ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలోని హాస్టల్ గదిలో ఎం.అఖిల ఉరి వేసుకోగా.. రెండు నెలల క్రితం కుటుంబ సమస్యలతో ఈశ్వరసాయి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. 2020 డిసెంబర్‌లో పరీక్షలో ఫెయిల్ కావడంతో సాయి మనోజ్ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇలా వరుస ఆత్మహత్యలవల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కాగా, నిరాశ, నిస్పృహతో ఉన్న వారికి మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తే ఇలాంటి ఘటనలు పునరావృత్యం కావని పలువురు అభిప్రాయపడుతున్నారు.

తల్లి, కుమారుడిపై దుండగుల దాడి

- బాలుడి మృతి
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం



గగన్ ప్రజ్వల్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : తల్లి, కుమారుడిపై గుర్తు తెలియని దుండగులు దాడిచేశారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలంలో జరిగిన ఈ సంఘటనలో తల్లి గాయపడగా బాలుడు మృతిచెందాడు. బాధితురాలు సుమలత కథనం మేరకు వివరాలు.. మండలపరిధిలోని గూడెంచెరువు గ్రామంలో నివాసం ఉంటున్న సునీల్‌కుమార్, సుమలతకు భీమిశెట్టి రుత్విక్ (8) భీమిశెట్టి గగన్ ప్రజ్వల్ (3) అనే కుమారులు, భీమిశెట్టి నాగశౌర్య అనే 5 నెలల అమ్మాయి ఉన్నారు. సునీల్‌కుమార్ 12 సంవత్సరాల కిందదట సుమలతను ప్రేమించి వివాహం చేసుకున్నాడు. సునీల్‌కుమార్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సునీల్‌కుమార్ పనికి వెళ్లగా సుమలత పిల్లలతో ఇంటి వద్ద ఉంది. మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు ముఖానికి మాస్కు ధరించి ఒక్కసారిగా సుమలతపై దాడిచేసి మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొన్నారు. భీమిశెట్టి గగన్ ప్రజ్వల్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన గగన్ ప్రజ్వల్‌ను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, డాక్టర్లు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి మృతి పట్ల స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ నాగరాజు, సీఐ సదా శివయ్య కడప నుంచి వచ్చిన క్లూస్ టీం అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామస్తులను విచారించారు. బాలుడి శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మహిళపై అత్యాచారం

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కట్టకింద హరిజనవాడలో నివాసం ఉంటున్న ఓ మహిళ (35)పై సోమవారం సాయంత్రం నరసింహులు, రఘు, హరికృష్ణలు అత్యాచారానికి పాల్పడ్డారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహిళకు, అశోక్‌నగర్‌కు చెందిన నరసింహులుతో పరిచయం ఉంది. పనికి వెళ్లి ఇంటికి వచ్చిన ఆమెకు, నరసింహులు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. అతనితో పాటు పై ఇద్దరు ఈ నేరానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాముడు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న నాగలక్ష్మీ

జమ్మలమడుగు : పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో జానపాటి నాగలక్ష్మీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. నాగలక్ష్మీ భర్త జానపాటి లక్ష్మీనరసింహులు తాడిపత్రి రహదారిలో ఉన్న రామకృష్ణ ఫిల్లింగ్ సెంటర్‌లో మేనేజరుగా విధులు నిర్వహిస్తున్నాడు. పెట్రోల్ బంకుకు సంబంధించిన దాదాపు రూ. 80 లక్షలకు పైగా డబ్బులు వాడుకున్నాడంటూ పెట్రోల్ బంకు యజమాని డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి గతేడాది అక్టోబర్‌నెలలో ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం పోలీసులు విచారణ చేయడంతో నిజమని తెలడంతో పోలీసులు జానపాటి నరసింహులుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తమకు ఎలాంటి సంబంధంలేదని నరసింహులు భార్య నాగలక్ష్మీ పోలీసు స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగింది. వెంటనే పోలీసులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

‘డాక్టర్ తవ్వా’కు సత్కారం



డాక్టర్ తవ్వా వెంకటయ్యనుసత్కరిస్తున్న సాహిత్య, కళా సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్ : యువ రచయిత, సాహిత్య పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్యను రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా సంఘం సభ్యునిగా నియమించిన సందర్భంగా సోమవారం పలు కళా, సాహిత్య సంఘాలు ఘనంగా సత్కరించాయి. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, జానమద్ది సాహితీపీఠం, డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, శ్రీ వెంకటేశ్వర నాటక మండలి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రతినిధి కేవీ రమణారెడ్డి, వెంకటయ్య బంధుమిత్రులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వెంకటయ్య భాషా ప్రేమికుడిగా, విమర్శకుడిగా, కథకుడిగా చేసిన సాహితీ కృషిని గుర్తించిన ప్రభుత్వం అధికార భాషా సంఘం సభ్యునిగా నియమించడం అభినందనీయమన్నారు. బ్రౌన్ కేంద్రం సలహా మండలి సభ్యుడు షేక్ హుసేన్ సత్యాగ్ని మాట్లాడుతూ డాక్టర్ తవ్వా వెంకటయ్య ఈ పదవికి అన్ని విధాలా అర్హుడని, ప్రభుత్వం అర్హతకు ప్రాధాన్యతనిస్తూ ఆయనకు ఆ పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. మరో సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ తెలుగుభాష అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకునేలా తవ్వా వెంకటయ్య కృషి చేయాలన్నారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ వెంకటయ్య మంచి పరిశోధన దృక్పథం గలవాడని, అధికారభాష అమలుకు విలువైన సూచనలు చేయగలరన్న విశ్వాసం ఉందన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ అధికార భాషగా తెలుగు అమలు కోసం వెంకటయ్య తగిన కృషి చేయాలని కోరారు. రచయిత కేవీ రమణారెడ్డి, మునికుమార్, రంగ స్థల నటుడు మధుబాబు, కొత్తపల్లి రామాంజనేయులు కూడా ప్రసంగించారు. డాక్టర్ వెంకటయ్య తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలుపుతూ తన పరిధిలో తాను చేయగలిగిన మేరకు అధికార భాషగా తెలుగు అమలుకు కృషి చేస్తామన్నారు. గ్రంథ పాలకులు జి.హరిభూషణ రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయ ఉమ్మడి పరీక్షతో ఉజ్వల భవిష్యత్తు



కరపత్రాలు విడుదల చేస్తున్న వెంకటకృష్ణారెడ్డి, రామచంద్ర, శ్రీనివాసులరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్ : కేంద్రీయ విశ్వ విద్యాలయ ఉమ్మడి పరీక్షతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీవీ రామన్ సైన్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల మొయిన్‌లో కేంద్రీయ విశ్వ విద్యాలయాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష-2023కు సంబంధించి వెబినార్ కరపత్రాన్ని సీవీ రామన్ సైన్స్ క్లబ్ గౌరవ సలహాదారు డాక్టర్ పత్తి వెంకట కృష్ణారెడ్డి, ఐటీ సలహాదారు డాక్టర్ బి. రామచంద్ర, సైన్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, కార్యదర్శి నరేంద్ర, గౌరవాధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు, రెహమాన్‌లు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీయూఈటీ-2023 ప్రవేశ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా 90కి పైగా కేంద్రీయ విశ్వ విద్యాలయాలు, ప్రైవేటు యూనివర్సిటీల్లో 102 అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశించడానికి తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులకు ఈ పరీక్షపై అవగాహన కల్పించడానికి ఈనెల 15వ తేదీ సాయంత్రం 6 గంటలకు రామన్ సైన్స్‌క్లబ్ ప్రముఖులతో ఆన్‌లైన్ విధానంలో వెబినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ వెబినార్ లింక్‌ను సామాజిక మాధ్యమాల ద్వారా అందచేస్తామన్నారు. ఇతర వివరాలకు 9492378327, 9493369454, 9492753765 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కడప కేంద్రకారాగారంలో హెచ్ఐవీ సెంటినల్ సర్వైలెన్స్



ఖైదీలకు హెచ్ఐవీ సెంటినల్ సర్వైలెన్స్ నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

కడప అర్బన్: జాతీయ స్థాయిలో హెచ్ఐవీ నియంత్రణ కోసం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఎన్ఏసీఓ) ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్తంగా కడప కేంద్రకారాగారంలోని ఖైదీలకు హెచ్ఐవి సెంటినల్ సర్వైలెన్స్-2023ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖైదీల్లో ఎంతమంది హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్‘బి’, ‘సి’ సమాచారాన్ని సేకరించేందుకు సర్వైలెన్స్ ప్రారంభించారు. ప్రతి కారాగారం నుంచి దాదాపు 400 మంది ఖైదీలతో సర్వే జరుపనున్నారు. ఈ సర్వేలో సేకరించిన సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతారు. కార్యక్రమంలో కడప కేంద్రకారాగారంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.కే.ఖాదర్‌వల్లీ, కడప కేంద్రకారాగార సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ జవహర్ బాబు, కారాగారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ వి. భాస్కర్, జిల్లా టీం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు పాలకొండ్రాయ డిగ్రీ కళాశాలకు వెళ్లే మార్గంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం(50) లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు పాడుబడిన రేకులషెడ్డు నుంచి దుర్వాసన రావడం స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రేకులషెడ్డు తలుపులు తెరచి చూడగా మృతదేహం కనిపించింది. మృతదేహం పక్కన మద్యం సీసా, ప్లాస్టిక్ గ్లాసు ఉండటంతో అతిగా మద్యం తాగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో 203 కేసులు

కడప అర్బన్ :జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సోమవారం పోలీసు అధికారులు వాహనాల స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 203 కేసులు నమోదు చేశారు. ఇందులో హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపినవారిపై 174 , సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపుల డ్రైవర్లపై 29 కేసులు నమోదు చేశారు.

టీడీపీ నాయకుడి మట్టి దందా

చెక్ పెట్టిన సబ్‌కలెక్టర్ అహమ్మద్ ఖాన్



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్‌లు

రాజంపేట రూరల్ : మండలంలోని పెద్దకారంపల్లి పంచాయతీ గుండాలపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు జేసీబీలు, ట్రాక్టర్లతో కృష్ణమ్మ చెరువును అనువుగా చేసుకొని మట్టి దందా కొనసాగించేవాడు. నిర్విరామంగా కొనసాగుతున్న ఈ మట్టి దందాకు సబ్ కలెక్టర్ ఆహమ్మద్‌ఖాన్ చెక్ పెట్టారు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో కృష్ణమ్మ చెరువు నుంచి మట్టి అక్రమ రవాణా చేస్తున్న సమయంలో సబ్ కలెక్టర్ ఆహమ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ రాజేష్ ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. వీటిని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అయితే ఇక్కడ మట్టి రవాణా చేస్తున్న 8 ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయం తెలియగానే చెరువులో ఉన్న జేసీబీ, మిగిలిన ట్రాక్టర్లు, తన అనుచరులతో మట్టి దందా చేస్తున్న నాయకుడు పలాయనం చిత్తగించాడు.రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకుని మట్టిదందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పొదుపు డబ్బు కోసం వెళ్లొస్తుండగా..

బైక్,ఆర్టీసీ బస్సు ఢీ : ఇద్దరు మృతి



గురుస్వామి (ఫైల్)



జల్ల అంజి మృతదేహం



గురుస్వామి మృతదేహం



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : వారంతా రోజు వారి కూలి పనికి వెళ్లి జీవనం సాగించేవాళ్లే. కూలీ చేసుకొని కూడగట్టుకున్న డబ్బు కోసం జమ్మలమడుగుకు వెళ్లారు. తిరిగి వస్తున్న సమమయంలో ఇద్దరిని మృత్యువు కబలించింది. జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని శంకరాపురం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీ కొన్న సంఘటనలో బైక్‌లో వస్తున్న టంగుటూరు గురుస్వామి (45), జల్ల అంజి (35) మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు ప్రొద్దుటూరులోని మోడంపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు జమ్మలమడుగులోని ఒక ప్రైవేట్ సంస్థలో నెల నెలా డబ్బు పొదుపు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో డబ్బును డ్రా చేసుకునేందుకు 16 మంది సోమవారం జమ్మలమడుగుకు వెళ్లారు. అక్కడ పని పూర్తయిన తర్వాత మహిళలు ఆటోలో ప్రొద్దుటూరుకు వెళ్లగా పురుషులు బైకుల్లో బయలుదేరారు. శంకరాపురం గ్రామ సమీపంలో ఎడమ వైపు రోడ్డులో మార్కింగ్ లైన్లు వేస్తుండటంతో ఆ మార్గాన్ని మూసేశారు. దీంతో వాహనాల రాకపోకలన్నీ కుడి వైపు రోడ్డులో సాగుతున్నాయి. గురుస్వామి, అంజి కలిసి కుడి వైపు రోడ్డులో వెళ్తుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో గురుస్వామి అక్కడికక్కడే మృతి చెందగా అంజి తీవ్రంగా గాయ పడ్డాడు. అతన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కొద్ది సేపటి తర్వాత మృతి చెందాడు.

మోడంపల్లెలో విషాదచాయలు..

మోడంపల్లెకు సుమారు 25 కుటుంబాల వాళ్లు జమ్మలమడుగులోని ఒక ప్రైవేట్ సంస్థలో డబ్బు పొదుపు చేసుకున్నారు. వారి స్థోమతను బట్టి నెలకు రూ.1000, 2000, 2500 జమ డబ్బు కడుతున్నారు. ఈ క్రమంలో గడువు ముగియడంతో డబ్బు డ్రా చేసుకునేందుకు కొందరు జమ్మలమడుగుకు వెళ్లారు. అక్కడ కార్యాలయంలో పని ముగించుకున్న తర్వాత తిరిగి వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. గురుస్వామి లారీ డ్రైవర్‌గా పనికి వెళ్తుంటాడు. అతనికి భార్య నరసమ్మ, మాధవి, సుప్రియ అనే కుమార్తెలు, తేజ, గణేష్ అనే కుమారులు ఉన్నారు. మాధవి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుండగా తేజ ఇంటర్మీడియెట్, గణేష్, సుప్రియ పాఠశాల విద్య అభ్యస్తున్నారు. మాధవి సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు వచ్చింది. రోడ్డు ప్రమాదంలో గురుస్వామి మృతి చెందాడన్న వార్త తెలుసుకొని కుటుంబ సభ్యులందరూ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మోడంపల్లెలో నివాసం ఉంటున్న అంజి టీచర్స్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య పరిమళ, అంజిత అనే కుమార్తె చిన్న అంజి అనే కుమారుడు ఉన్నారు. కుమార్తె 6వ తరగతి, కుమారుడు 10వ తరగతి చదువుతున్నారు. ఒకే వీధిలో నివసిస్తున్న ఇద్దరు మృతి చెందడంతో మోడంపల్లెంలో విషాదం నెలకొంది. రూరల్ ఎస్ఐ సంజీవరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

‘యానిమేటర్‌ను తొలగించాలి’

వీరబల్లి: అన్నమయ్య జిల్లా గడికోట గ్రామంలోని శ్రీ ఆంజనేయ జయలక్ష్మీ గ్రూపు సభ్యులకు సంబంధించిన రూ. 2 లక్షల వరకు యానిమేటర్ నాగంజి నొక్కేశాడంటూ సోమవారం గ్రూపు సభ్యులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. 28 గ్రూపులకు సంబంధించి డబ్బులు తినేశాడని, ఇతను ప్రతి గ్రూపులోను అవినీతికి పాల్పడుతున్నాడని చెప్పారు. తాము కూలి పనులు చేసుకొని నమ్మకంతో అతనికి డబ్బులు ఇస్తే రశీదులు ఇవ్వకుండా.. అప్పు తీరిపోయినప్పటికీ ఇంకా కట్టాలని చెప్పడంతో తమకు అనుమానం వచ్చింది. దీంతో అధికారులకు తెలియజేయగా డబ్బులు నొక్కేశాడని తెలిసిందన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడగా యానిమేటర్ అక్రమాలకు పాల్పడుతున్న విషయం వాస్తవమేనని అతనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘దిశ ’ పోలీస్‌స్టేషన్ సేవలు బేష్



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు లక్ష్మీదేవి

కడప అర్బన్ : కడపలోని ‘దిశ’ పోలీస్‌స్టేషన్‌లో భార్యాభర్తల కౌన్సెలింగ్ , బాలికలు, మహిళల సమస్యలను గుర్తించి వారికి సరైన పరిష్కారమార్గాలను చూపుతున్న పోలీసు అధికారుల, సిబ్బంది సేవలు అభినందనీయమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యురాలు ముడిమేల లక్ష్మీదేవి అన్నారు. సోమవారం ఆమె కడపలోని దిశ మహిళాపోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. మహిళల కౌన్సెలింగ్ సెంటర్‌ను పరిశీలించారు. బద్వేల్‌కు చెందిన షేక్ మహినూర్, భర్త ఆలీషేర్‌తో మాట్లాడి జంటను కలిపారు. జిల్లాలోని పోక్సో, మహిళల కేసుల విచారణ వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు. రిసెప్షన్ సెంటర్ వద్ద ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళలను పలుకరించారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని ‘దిశా కవచ్’ యంత్రాన్ని చెక్ చేశారు. అనంతరం ఆమె డీఎస్పీ రెడ్డివారి వాసుదేవన్‌తో మాట్లాడారు. మహిళలపై జరిగే అత్యాచార కేసుల్లో కఠిన శిక్షలు పడే విధంగా వ్యవహరించాలని, తద్వారా మహిళలు, బాలలపై అత్యాచారాలు చేసేవారు భయపడాలన్నారు.కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.